క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



హేమంబ్రాచారి, అధ్యక్షుడు

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నేలకొండ యాకన్నచారి, మండల ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారిల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సొల్లేటి హేమాంబ్రాచారి, ఉపాధ్యక్షుడిగా కట్లోజు వెంకటనారాయణచారి, ప్రధాన కార్యదర్శిగా బైరోజు రామలింగాచారి, కోశాధికారిగా అలుగోజు రవీంద్రచారి, గౌరవ అధ్యక్షుడిగా దామోదరాచారి, వెంకటేశ్వర్లు, సభ్యులుగా రవీంద్రచారి, పగడిద్దాచారి, మధనాచారి, ఆచారి, రాజయ్య, బ్రహ్మచారి ఎన్నికయ్యారు.

హెల్త్ సెంటర్ నిర్మాణానికి భూమి కేటాయించాలి



రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామంలో హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి భూమిని కేటాయించాలని సర్పంచ్ చిన్నాల తారశ్రీ బుధవారం మండల తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి హెల్త్ సెంటర్ మంజూరైనట్లు తెలిపారు. భూమిని కేటాయిస్తే నిర్మాణ పనులు చేపడతామని తహసీల్దార్‌ను కోరారు.

నాగుపాము కలకలం

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో బుధవారం ఉదయం నాగుపాము కలకలం రేపింది. స్థానిక జియో నెట్ వర్క్ షోరూం ఎదుట కస్టమర్లకు నాగు పాము కనిపించింది. పామును చూసిన వారు షాపు యాజమాన్యానికి తెలపడంతో వారు పాములు పట్టే వారికి సమాచారం అందించారు. అనంతరం పామును పట్టి తీసుకు వెళ్లి అటవీ ప్రాంతంలో వదిలారు.

బీసీల రిజర్వేషన్ పెంచాలి

నర్సంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతానికి రిజర్వేషన్ పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు డ్యాగల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42శాతానికి పెంచుతామని బీసీ డిక్లరేషన్‌లో పొందుపర్చారని గుర్తు చేశారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఒడపల్లి రమేష్, మద్దెల కొమురయ్య, బేతి భాస్కర్, మద్దెల శ్యాం, మర్రి క్రాంతి కుమార్, ఒడపెల్లి గోవర్ధన్, శీరంశెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



పర్వతగిరి : షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన తుంగ రాజు ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో చుట్టుపక్కల వారు సంఘటన స్థలానికి చేరుకొని నీళ్లతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇళ్లు పూర్తిగా దగ్ధం కావడంతో అందులో ఉన్న సామగ్రి కాలిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

మామపై అల్లుడి దాడి

ఖానాపురం : మామపై అల్లుడు దాడికి పాల్పడిన సంఘటన అశోక్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... అశోక్‌నగర్‌కు చెందిన వీరయ్య తన కుమార్తెను నర్సంపేటకు చెందిన అశోక్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ఈ క్రమంలో కొంత కాలంగా వారికి గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం అశోక్ మద్యం మత్తులో అశోక్‌నగర్ చేరుకుని అత్తామామతో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో మాటామాటా పెరగడంతో వీరయ్యపై అశోక్ కత్తితో దాడి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వీరయ్యను ఆస్పత్రికి తరలించారు. బుధవారం అశోక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌చార్జ్ ఎస్సై నగేష్ విచారణ చేశారు.

ఉచిత వైద్యశిబిరం

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ బోడకుంట్ల ప్రభాకర్‌వర్మ పెరిక కులస్తులకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు హనుమకొండలోని అమృత న్యూరో క్లీనిక్‌లో పెరిక కులస్తులకు ఉచితంగా ఓపీ సేవలు, చికిత్స కోసం అడ్మిట్ అయిన వారికి బిల్లుపై 20శాతం రాయితీ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ఉచిత సేవలు అందించిన ప్రభాకర్‌వర్మను పెరిక కులస్తులు బుధవారం హనుమకొండలోని ఆస్పత్రిలో సన్మానించారు.

సమన్వయంతో పనిచేయాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అనిమిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిమిరెడ్డి



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, శాఖల అధికారులు

రాయపర్తి : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతీ సమావేశానికి హాజరై సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్లు తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం వచ్చిన మహిళా సర్పంచ్‌లను వారే వినియోగించుకున్నారని సతులకు బదులుగా పతులు సర్వసభ్య సమావేశంలో పాల్గొనలేదని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వంలోనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పని చేయాల్సిందేనని వివరించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి మీదుగా ఉన్న ఎస్సారెస్పీ కాల్వ పూడుకుపోవడంతో రాయపర్తి గణపురం చెరువుగుండా నీళ్లు రావడంలేదని సమస్య పరిష్కరించాలని సర్పంచ్ గారె నర్సయ్య ఐబీ ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. రామచంద్రుని చెరువుకు వచ్చే కాల్వలో పూర్తిగా గడ్డి పెరిగి ఇబ్బందవుతున్నట్లు చెప్పారు. రాయపర్తి బస్టాండ్ ప్రాంతంలో బస్సులు లోపలికి రాకుండా బయటిగుండానే వెళ్లడం వల్ల ప్రయాణికులు ఎండకు వానకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బస్సును బస్టాండ్ లోపలికి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ బిల్లా రాధిక ఆర్టీసీ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని బందనపల్లి, కొత్తూరు, ఊకల్ గుండా బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్‌లు దీప్లా నాయక్, హరినాథ్ కోరారు. ఉద్యానవన శాఖల నుంచి వచ్చే సబ్సిడీలను వినియోగించుకొని ఆయిల్‌పాం తదితర పంటలను సాగు చేసుకొని రైతులు ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఆ శాఖాధికారి సుష్మిత కోరారు. కాగా ప్రజా ప్రతినిధులు తెలిపిన సమస్యల పరిష్కారం కోసం అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ గుగులోత్ కిషన్, ఎంపీఓ తుల రామ్మోహన్, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్లధనంపై కాంగ్రెస్ జవాబివ్వాలి

- బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి



నిరసన తెలుపుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

గీసుకొండ : రాహుల్ గాంధీకి సన్నిహితుడైన ఎంపీ ధీరజ్ సాహు ఇంట్లో వందల కోట్ల నల్లధనం బయటపడిందని, దీనికి కాంగ్రెస్ అధిష్టానం ప్రజలకు జవాబు చెప్పాలని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గీసుకొండ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లధనంపై నిరసన తెలిపి మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మగడ్డ జాన్‌విక్రం, పరకాల అసెంబ్లీ కన్వీనర్ ముల్క ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కొంగర రవికుమార్, ఉపాధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కత్తి రమేశ్, ఏకాంబ రాజిరెడ్డి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలి పాడ్యమి



పూజలు చేస్తున్న మహిళలు

వర్ధన్నపేట : పోలి పాడ్యమి వేడుకలను బుధవారం మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వర్ధన్నపేట శివాలయ పూజారి దేవేంద్రశర్మ ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకాలు, అర్చనలు, అన్నపూజ చేశారు. ఈ సందర్భంగా పోలి పాడ్యమి విశిష్టతను వివరించారు. కార్తీక మాసంలో శివుడిని పూజిస్తే.. మార్గశిర మాసంలో విష్ణుమూర్తిని పూజిస్తారని వివరించారు. పోలి పాడ్యమిని పురస్కరించుకుని అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి, నీటి కొలను, చెరువులు, నదుల్లో పసుపు కుంకుమలతో వదులుతారని అన్నారు. కార్తీక మాసం పూర్తి కాగానే పోలి స్వర్గం కథను భక్తులకు వినిపించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. అనంతరం తీర్థ ప్రసాదల వితరణ చేశారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు అశోక్ తల్లి ఆకుల లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. కాగా లక్ష్మి మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్, సర్పంచ్ తూటి పావని, ఉపసర్పంచ్ బానోత్ వీరన్న నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, స్వామి, వెంకన్న, భద్రయ్య, రాజేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన



చలపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

దుగ్గొండి : మహిళలు తమకు కల్పించిన రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం కౌన్సిలర్ సుధ అన్నారు. మండలంలోని చలపర్తి, తొగర్రాయి గ్రామాల్లో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గృహహింస, వరకట్న వేధింపులు, బాలికలు, మహిళల అక్రమ రవాణా, అమ్మాయిలను ప్రేమ పేరుతో మోసగించడంపై వివరించారు. బాల్య వివాహాలు, భ్రూణహత్యల నిర్మూలనపై అవగాహన కల్పించారు. సీసీ పద్మ, వీఓఏలు లక్ష్మీదేవి, రేణుక, సఖి కేంద్రం బాధ్యులు నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన నాయకులు



వర్ధన్నపేట : ఎమ్మెల్యే నాగరాజుకు పూలబొకే అందజేస్తున్న నాయకులు



నర్సంపేట రూరల్: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు



సంగెం: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కలిసిన పంచాయతీ కార్యదర్శులు

వర్ధన్నపేట : వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన కె.ఆర్ నాగరాజును బుధవారం హనుమకొండలోని ఆయన నివాసంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండి వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ శ్రీనివాస్, సిలివేరు శ్రీధర్ యాదవ్, మైస సురేష్, గట్టు శ్రీనివాస్, దుబ్బాక రాజుగౌడ్, శివగౌడ్, సాయిగౌడ్, గోధుమల విక్కి ఉన్నారు.

ఎమ్మెల్యే దొంతిని కలిసిన నాయకులు

నర్సంపేట రూరల్ : నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన దొంతి మాధవరెడ్డిని బుధవారం నర్సంపేట మండలంలోని రాములునాయక్ తండా, ముత్తోజిపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ముత్తోజిపేట ఎంపీటీసీ గంగిడి సాంబరెడ్డి, గ్రామ నాయకులు మాడుగుల మల్లారెడ్డి, రాజు, సూరయ్య, బూర సుమన్, శ్రీనివాస్, రజాక్, రఫీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి


చెన్నారావుపేట : ఉద్యోగాలు సాధించినప్పటికీ ట్రెయినింగ్ ప్రక్రియ ప్రారంభించలేదని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగం పొందిన యువకులు బుధవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అన్ని రకాల పరీక్షలు పూర్తి చేసుకొని ట్రెయినింగ్ కోసం సిద్ధపడి ఉండగా కొందరు వ్యక్తులు తమ స్వలాభం కోసం కోర్టును ఆశ్రయించి ఎంపిక ప్రక్రియకు ఆటంకం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యకు పరిష్కారం వచ్చేలా కృషి చేయాలని వారు కోరారు.

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ చింతకింద వంశీ, నలమాస కర్ణాకర్, కుండె కుమారస్వామి, ఎడ్ల నారాయణరెడ్డి, ఆవుల రాములుతో పాటు పలువురు నాయకులు బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


రేవూరిని కలిసిన పంచాయతీ కార్యదర్శులు

సంగెం : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని సంగెం ఎంపీఓ కొమురయ్య ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో రేవూరిని శాలువా కప్పి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఖలీల్, రాజ్‌కుమార్, రవీందర్, రమేష్, రామకృష్ణ, వంశీ, అనిత, సునీత, అనూష, స్వప్న, రెహానా, సందీప్, అజయ్, రజనీకాంత్, నాగరాజు, అశోక్ ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి



దుగ్గొండి: సన్మానం పొందిన ఉపాధ్యాయులు



పర్వతగిరి: హెచ్‌ఎం రమేష్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

పర్వతగిరి : విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్పంచ్ గటిక సుష్మమహేష్ అన్నారు. మండలంలోని చింతనెక్కొండ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న హెచ్‌ఎం రమేష్ బదిలీ కావడంతో బుధవారం సన్మానించారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చాలాకాలం పాటు విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు రెడ్డి ప్రవీణ్‌కుమార్, రావుల దేవేందర్, కిష్టయ్య, వెంకన్నలను పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బాసాని రవి, హెచ్‌ఎం రామస్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

- అసంపూర్తిగా నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా ఉన్న మహిళా సంఘం భవనం

ఖానాపురం : మహిళా సంఘాల సభ్యులు తమ సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు భవనాన్ని నిర్మిస్తున్నారు. కాగా భవన నిర్మాణానికి 2017 సంవత్సరంలో నిధులు మంజూరయ్యాయి. నాటి ఎమ్మెల్సీ ఆకుల లలిత రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. మంజూరైయిన నిధులతో పాటు మరికొంత అదనంగా నిధులు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టారు. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న భవనాన్ని పూర్తి చేయించడానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేయించినట్లు జీఓ తీసుకువచ్చారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రభుత్వం మారడంతో మళ్లీ భవనం పరిస్థితి అసంపూర్తిగానే నిలిచిపోయింది. భవనం పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగితే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఇటీవల మంజూరైన నిధులు వస్తాయా.. లేదా అనే సందిగ్ధం ఏర్పడింది. మండల సమాఖ్య అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తయ్యే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

‘దివ్యాంగులకు ఉద్యోగ అవకాశం’



ఎంఓయూ కాపీని అందజేస్తున్న సంస్థ ప్రతినిధి

వర్ధన్నపేట : దివ్యాంగ నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భారత దివ్యాంగుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎండీ షరీఫ్ అన్నారు. దివ్యాంగుల జీవితాలు మెరుగుపడేందుకు ఉద్యోగ అవకాశాలు కల్పించుకోవడానికి ‘యూత్ ఫర్ జాబ్స్ డిజేబుల్’ అనే సంస్థతో బుధవారం ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. యూత్ ఫర్ జాబ్స్ సంస్థ ద్వారా నిరుద్యోగ దివ్యాంగులకు 20 వేల కంపెనీలతో టై అప్ అయి ఉందన్నారు. కేవలం దివ్యాంగ నిరుద్యోగులకు మాత్రమే ఈ సంస్థ ఉద్యోగ అవకాశం కల్పిస్తోందన్నారు. ఉద్యోగం చేయాలనుకునే దివ్యాంగులు మరిన్ని వివరాల కోసం 99855 74821 ద్వారా సంప్రదించవచ్చన్నారు. ఈ ఎంఓయూకు సహకరించిన సంస్థ ప్రతినిధి నాగేశ్వర్ రావుకు షరీఫ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జిట్టబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



గ్రామంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లు



మాట్లాడుతున్న తిర్మలాయపల్లి గ్రామస్తులు

రాయపర్తి : డబుల్ బెడ్రూం ఇళ్లు పేదలకు ఇవ్వకుండా ఆర్థికంగా ఉన్న వారికే కేటాయించారని మండలంలోని తిర్మలాయపల్లి గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఈ సమస్యపై తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 ఏళ్లక్రితం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో పేదలకు ప్లాట్లు కేటాయించారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందు ప్లాట్లు చేసి డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మిస్తున్నట్లు వివరించారు. 40 మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు, పది ఎకరాలు భూమి ఉన్నవారికి కేటాయించారని ఆరోపించారు. విచారణ చేసి అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బలముల అశోక్, నర్సయ్య, కుమార్, ఎండీ యాకూబ్, ఉప్పుల శివ, సందీప్, రాకేష్, నర్సింహరాములు, గజవెల్లి రాజు, కరీష్మా తదితరులు పాల్గొన్నారు. తిర్మలాయపల్లిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలకే కేటాయించినట్లు ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి తెలిపారు.

జీడీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి



నర్సంపేట: పోస్టాఫీస్ ఎదుట నినాదాలు చేస్తున్న తపాలా ఉద్యోగులు



సంగెం మండల కేంద్రంలో..



వర్ధన్నపేట తపాలా కార్యాలయం ఎదుట..



దుగ్గొండి: తొగర్రాయి పోస్టాఫీస్ ఎదుట..

వర్ధన్నపేట : తమ సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామీణ తపాలా ఉద్యోగులు దేశవ్యాప్త నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వర్ధన్నపేట తపాలా శాఖ కార్యాలయం ఎదుట జీడీఎస్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో తపాలా ఉద్యోగులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. అయినా తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మౌలానా, చారి, సదానందం, రాంచందర్ తదితరులు ఉన్నారు.

సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలి

నర్సంపేట : గ్రామీణ తపాలా ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని ఏఐజీడీఎస్‌యూ మాజీ అధ్యక్షుడు శాబుద్దీన్ కోరారు. నర్సంపేట పట్టణంలోని పోస్టాఫీస్‌లో జీడీఎస్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడీఎస్ సీనియర్ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలకు పెంచాలన్నారు. కుటుంబ సభ్యులతో సహా వైద్య సదుపాయం కల్పించాలని, ఇన్సెంటివ్ పద్ధతి రద్దు చేయాలని, టార్గెట్ రూపంలో వేధింపులు ఆపి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీడీఎస్ ఉద్యోగులు అశోక్, లక్ష్మయ్య, కృష్ణమూర్తి, రవి, అనూష, పవన్, కల్పన, సారంగం, చందర్, యశ్వంత్, రవళి, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన సమ్మె

దుగ్గొండి : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె దీక్ష బుధవారం రెండో రోజుకు చేరింది. ఈ మేరకు తొగర్రాయి పోస్టాఫీసు ఎదుట ఉద్యోగులు సమ్మెలో భాగంగా దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం, 8 గంటల పనివేళల అమలు, సివిల్ సర్వెంట్ హోదా, వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, అన్వర్, నరేష్, అరవింద్, శివకోటి, బాలకృష్ణ, వెంకటరమణ, రమ, నజియ, అపూర్వ తదితరులు పాల్గొన్నారు.

డాక్ సేవకుల సమ్మె

సంగెం : గ్రామీణ డాక్ సేవకులు (జీడీఎస్) తలపెట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు కొనసాగింది. జేఏసీ పిలుపు మేరకు బ్రాంచ్ పోస్టాఫీస్‌ల్లో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవకులు విధులు బహిష్కరించి బుధవారం మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ ఎదుట తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ, నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో రజాక్, శ్రీను, శైలు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లోని పోస్టాఫీస్‌లు మూసివేయడంతో వినియోగదారులు డాక్ సేవలు అందుకోలేకపోయారు.

‘ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ’ సదస్సు



నర్సంపేట : నర్సంపేటలోని బాలాజీ బాలికల కళాశాల ఆవరణలో ప్రతిభ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల వారోత్సవాల సందర్భంగా బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ అధ్యక్షుడు గిరిగాని సుదర్శన్ గౌడ్ హాజరై మాట్లాడారు. 1948 డిసెంబర్ 10వ తేదీన ఐక్యరాజ్యసమితి మానవులందరికి హక్కులు కల్పించడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా కుల, మత, జాతి, లింగభేదం లేకుండా ఏవిధమైన వివక్షకు గురికాకుండా ఉండే హక్కు కల్పించారన్నారు. వెట్టిచాకిరి, బానిసత్వం నుంచి రక్షణ పొందే హక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కులు కల్పించారన్నారు. స్వయం కృషి సంస్థ అధ్యక్షుడు బెజ్జంకి ప్రభాకర్, ఛాయా సంస్థ అధ్యక్షుడు కోట డేవిడ్, స్వేచ్ఛశ్రీ సంస్థ అధ్యక్షురాలు మైస వసంత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తోడ్పాటు



నయింనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య ఆధ్వర్యంలో కమిటీ బాధ్యులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గ్రేటర్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రెస్ క్లబ్ కమిటీ ఆహ్వానం మేరకు త్వరలో ప్రెస్ క్లబ్‌కు వస్తామన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రెటరీలు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274